సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



రాయలసీమకు పోలవరం నీళ్లు

- రూ.12 కోట్లతో మదనపల్లె అభివృద్ధి
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నదులను అనుసంధానం చేస్తూ పోలవరం నీటిని రాయలసీమకు అందించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక సుభాష్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజల మీద రూ.10.5 లక్షల కోట్లు అప్పుల భారం మోపిందని, కానీ నేడు చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా పయనింపచేస్తున్నారని తెలిపారు. రాయలసీమకు పోలవరం నీటితో సాగు, తాగునీటి సమస్య తీరుతుందన్నారు. దీంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాసంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. వీటితో పాటు టూరిజం కారిడార్‌తో పాటు, ఐటీ హబ్ ఏర్పాటు సీఎం కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల పాటు సీఎంవో వైపునకు రాని జగన్ ప్రజలను మోసం చేశారని, చంద్రబాబు నిత్యం సీఎంవోకు వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. మదనపల్లె పట్టణం అభివృద్ధికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎంకు అందించామని, ఆయన దానికి సానుకూలంగా స్పందించారన్నారు. సీటీఎం రోడ్డు బర్మావీధి శివాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు బాహుదానది మీద ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరామన్నారు. సీటీఎం రోడ్డు విస్తరణలో భాగంగా చింతచెట్లను తొలగిస్తే కొందరు గిట్టని వారు లేనిపోనివి సృష్టించారని తెలిపారు. మదనపల్లె నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణాలను టీడీపీ కార్యకర్తలకు అప్పగించి పారదర్శకంగా పనులు చేయిస్తున్నామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు విద్యాసాగర్, నీలకంఠ, ఎస్ఎఫ్ రఫీ, ఎస్ఏ మస్తాన్, గుర్రప్పనాయుడు, షంషీర్, బాబాఫకృద్దీన్, రాటకొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురండి

- హోంగార్డుల సేవలు అభినందనీయం
- రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా జిల్లా పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన రాయచోటిలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో హోంగార్డుల పెరేడ్‌ను తనిఖీ చేసి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ద్విచక్రవాహనంపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క హోంగార్డు ఇన్సూరెన్స్ (బీమా) చేసుకోవాలని, సంవత్సరానికి ఒకసారి మెడికల్ చెకప్ చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.



ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించాలో వారికి దిశానిర్దేశం చేశారు. హోంగార్డ్స్ సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏఆర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, సబ్‌డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జిలు శ్రీనివాసులు, రమేశ్, హోంగార్డ్స్ పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్

టమోటా రైతుకు తుంపర్ల దెబ్బ

- తోటల్లోనే రాలిపోతున్న టమోటాలు
- నష్టాల బాటలో రైతన్నలు
- నాణ్యతా లోపంతో ధరలు పతనం

6



వీరబల్లి మండలం పెద్దివీడు తిమ్మారెడ్డికుంటను ఆక్రమించి కంచె వేసిన దృశ్యం



అక్రమార్కులకు స్వర్ణయుగంగా చెప్పుకునే వైసీపీ పాలనలో పలు చెరువులు, కుంటలు ఆ పార్టీ నాయకుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. జగనన్న జమానాలో కొందరు అధికారులు నిస్సిగ్గుగా విధులు నిర్వహించారు. ప్రజల సొమ్ముకు జవాబుదారీగా ఉండాలనే కనీస ఆలోచన లేకుండా తప్పులు చేస్తే.. భవిష్యత్తులో అయినా కఠిన చర్యలు తప్పవనే భయం లేకుండా వైసీపీ నాయకులు చెప్పినట్లు నడుచుకున్నారు. ప్రజలందరికీ ఉపయోగపడే సహజ వనరులను పంచిపెట్టారు. రికార్డుల ఊసే లేకుండా చెరువులు, కుంటలను వైసీపీ నాయకుల పేరు మీద ఆన్‌లైన్ చేయించేశారు. ఇటువంటి అక్రమాలు గ్రామ గ్రామాన బయట పడుతున్నా ప్రస్తుతం వాటి గురించి పట్టించుకునే వారే లేరు. అక్రమాలకు పాల్పడ్డ, సహకరించిన అధికారులపైన ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో అసలు కూటమి ప్రభుత్వమేనా పాలన చేస్తోందని పలువురు ఆశ్చర్యపోతున్నారు.

కుంటనూ వదల్లేదు..

- వైసీపీ పాలనలో ఓ వ్యక్తి పేరుతో ఆన్‌లైన్ చేసేసిన అధికారులు
- జగన్ జమానాలో చెరువులు, కుంటల ఆక్రమణ
- ఆక్రమణలకు విముక్తి కలిగేనా?
- అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలేవీ?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం పెద్దివీడు గ్రామం రెడ్డివారిపల్లెలో సర్వే నెంబరు 446లో 44.80 ఎకరాల విస్తీర్ణంలో తిమ్మారెడ్డి కుంట ఉంది. ఈ కుంట రాయచోటి- వీరబల్లి మెయిన్ రోడ్డుకు ఉంది. ఈ కుంటలోకి సంఘంవాండ్లపల్లె, మట్లి యల్లంపల్లె, మట్లి తొగటపల్లె, బీసీ కాలనీ ప్రాంతానికి చెందిన ప్రజలు గొర్రెలు, మేకలు, గేదెలను మేతకు తోలుకుని వెళ్లేవాళ్లు. వందల సంవత్సరాలుగా ఈ కుంటలో నుంచి వెనుకన ఉన్న పొలాలకు రైతులు వెళ్లే వాళ్లు. అయితే ఈ కుంటను తాటిగుంట్ల వీర కొండ్రెడ్డిగారి రెడ్డెయ్య పేరు మీద 2.91 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. అతడి పేరు మీద ఆన్‌లైన్ చేసిన సర్వే నెంబరు 451/ఎ2గా నమోదు చేశారు. వాస్తవానికి ఇక్కడ 451/ఎ2 సర్వే నెంబరే లేదు. గతంలో చాలా సంవత్సరాల కిందట 451/1 నెంబరులో సుమారు ఒకటిన్నర ఎకరాను రైతులకు ప్రభుత్వం అసైన్‌మెంటు కింద ఇచ్చింది. రెడ్డెయ్య అనే వ్యక్తి ఆక్రమించుకున్న కుంటను సర్వే నెంబరు 451/ఎ2 పేరుతో అప్పటి తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి ఆన్‌లైన్ చేసేశారు. ఖాతా నెంబరు 1029. పట్టాదారు పాసు పుస్తకం కూడా ఇచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జాయింట్ కలెక్టర్ దగ్గరకు ఆన్‌లైన్ చేయించుకున్న ఆ వ్యక్తి ఒక బోగస్ డీకేటీ పట్టా తీసుకెళ్లి తనకు ఆన్‌లైన్ చేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు తెలిసింది. ఆ వినతిపత్రం మీద జాయింట్ కలెక్టర్ సంతకం చేయడంతో దానిని అడ్డం పెట్టుకుని ఇక్కడ రెవెన్యూ అధికారులను తనకు అనుకూలంగా మలుచుకుని భూమిని తన పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఆ స్థలాన్ని చదును చేసి చుట్టూ కంచె వేసి కుంటలోకి ఎవరూ వెళ్లేందుకు వీలు లేకుండా చేశారు. ఈ స్థలంలో ఓ గుడి కడుతున్నామని ప్రజలను నమ్మించి ఇప్పుడు మొత్తం స్థలం చుట్టూ కంచె వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అసలు రికార్డుల్లోనే లేని స్థలానికి రెవెన్యూ అధికారులు ఎలా ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రెవెన్యూ అధికారుల అవినీతి, అక్రమాలకు పరాకాష్టగా మిగిలే మరో సంఘటన రామాపురం మండలం బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లెలోనూ జరిగింది. ఇక్కడ యరాకుంటను కూడా వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారు. ఈ కుంట విస్తీర్ణం సుమారు 18 ఎకరాల వర కు ఉంటుంది. రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామం సర్వే నెంబరు-503లో సుమారు 12 ఎ కరాలు, బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లెలో సర్వే నెంబరు-166లో 6ఎకరాల వరకు విస్తరించి ఉంటుంది. ఇందులో సుమారు 8ఎకరాలు సదిపిరాళ్ల రెడ్డెమ్మ పేరు మీద అప్పటి రామాపురం తహసీల్దార్ మాధవ క్రిష్టారెడ్డి ఆన్‌లైన్ చేసేశారు. తర్వాత ఇదే మండలానికి తహసీల్దార్‌గా వచ్చిన మాధవక్రిష్టారెడ్డి భార్య అనురాధ గ్రామస్థుల వినతి మేరకు ఆన్‌లైన్ తొలగించారు. అయినా ఇప్పటికీ ఆ భూమి ఆక్రమణదారుల చేతుల్లోనే ఉంది. ఆక్రమించుకున్న వ్యక్తి ఆ స్థలం చుట్టూ పెద్ద పెద్ద బండరాళ్లు తోలి ఇతరులు ఎవరూ ఆ స్థలం గుండా వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇదే గ్రామ పరిధిలో సర్వే నెంబరు-151లో ఉన్న కుం టను సదిపిరాళ్ల రవీంద్రారెడ్డి పేరు మీద మాధవక్రిష్టారెడ్డి ఆన్‌లైన్ చేస్తే తహసీల్దార్‌గా వచ్చిన ఆయన భార్య దానిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ప్రజలందరూ గట్టిగా పట్టు బట్టడంతో ఇప్పుడు ఆ కుంట ఆక్రమణదారుల చేతుల్లో నుంచి బయటపడింది.



రామాపురంలోని యరాకుంటలో బండరాళ్లు తోలిన ఆక్రమణదారులు

తప్పుడు అధికారులపై చర్యలేవీ?

వైసీపీ పాలనలో రామాపురం, వీరబల్లి మండలాల్లో పనిచేసిన పలువురు తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో వైసీపీ నాయకులు చెప్పినట్లు విని పలు అక్రమాలకు సహకారం అందించారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలకు ముందు వీరబల్లి తహసీల్దార్‌గా పనిచేసిన మహేశ్వర్‌రెడ్డిపైన అనేక ఆరోపణలు ఉన్నాయి. ఎన్నో సంవత్సరాలుగా సాగులో ఉన్న భూములను వైసీపీ నాయకుల పేరు మీద ఆన్‌లైన్ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నఫలంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే పలువురి భూములు ఆన్‌లైన్‌లో మార్చేశారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రామాపురం మండలంలో గతంలో పని చేసిన మాధవ క్రిష్టారెడ్డిపైనా పలువురు ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ నాయకులు చెప్పినట్లు కుంటలు, గుట్టలను కూడా ఆన్‌లైన్ చేశారని ఆరోపిస్తున్నారు. రామాపురం మండలం బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లెను వైసీపీ పాలనలో ఓ వ్యక్తికి అప్పటి తహసీల్దార్‌లు ఖాజాబీ, శ్రీనివాసులు ఆన్‌లైన్ చేసిన విషయం తెలిసిందే. అక్రమాలకు పాల్పడిన పలువురు అధికారులు దర్జాగా లక్షలాది రూపాయలు సంపాదించుకుని అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మరో ప్రాంతానికి వెళ్లి తిరిగి తమ కానిచ్చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు చేసిన చేసిన అక్రమాలన్నీ తెలిసినా అటు కూటమి పార్టీల నాయకులు గానీ.. రెవెన్యూ ఉన్నతాధికారులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.

Adangal

సర్వే నెం : 451-ఎ2	పూర్తి విస్తీర్ణం : 2.91
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0	
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 2.91	
భూమి స్వభావం : ప్రభుత్వ భూమి	
శిస్తు (రూ.) : 1.42	భూమి వివరణ : ఎ.డబ్ల్యు
జల ధారము : వర్షం	ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 1029	
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 2.91	
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : తాటిగుట్ల వీర కొండ్రెడ్డిగారి (రెడ్డయ్య)	
అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు) : తాటిగుట్ల వీర కొండ్రెడ్డిగారి (రెడ్డయ్య)	
అనుభవ స్వభావం : డి.కె.టి	
రిమార్కులు :	

తిమ్మారెడ్డికుంట స్థలానికి రెడ్డెయ్య పేరుతో ఉన్న అడంగల్

ఓం నమో భగవతే రుద్రాయ

- భక్తులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ
- భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రత నోములు

తంబళ్లపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో తంబళ్లపల్లె మల్లయ్యకొండ పులకించింది. కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పురాతన శైవ క్షేత్రం మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో మల్లయ్యకొండకు తరలివచ్చిన భక్తుల సందోహంతో మల్లయ్యకొండ మరో మహాశివరాత్రిని తలపించింది. భక్తులు ఓం నమఃశివాయ, హర హర మహాదేవ శంభో శంకర అంటూ క్యూలైన్లలో శివన్నామస్మరణ చేసుకుంటూ భ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప స్వామి వారిని వెండి నాగాభరణంతో అలంకరించి దూపదీప నైవేద్యాలతో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తుల పేరిట అర్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కొండపైన కల్యాణ కట్ట వద్ద వందలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రత నోములు నోచుకున్నారు. ఆలయం ముందు భాగంలోని ధ్వజ స్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కొండ పైన భక్తులకు మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తంబళ్లపల్లె నుంచి మల్లయ్య కొండ పైకి ఆర్టీసీ బస్సులను నడిపారు.





ఆలయం వద్ద భక్తుల రద్దీ

టౌన్ బ్యాంకు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- 22న నామినేషన్ల స్వీకరణ
- 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

మదనపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ, బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్‌తో కలసి సోమవారం వివరాలు వెల్లడించారు. ఇందులోభాగంగా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఎన్నికల అధికారి మీడియాతో మాట్లాడుతూ 22వ తేదీ నామినేషన్ల స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అలాగే అదేరోజు సాయంత్రం 5 గంటలపైనా పోటీలోని అభ్యర్థుల తుది జాబితా ప్రకటనతో పాటు ఎన్నికల గుర్తు కేటాయించనున్నట్లు చెప్పారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే 29వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్, ఆ తర్వాత కౌంటింగ్ ఉంటుందని చెప్పారు. 12 మంది డైరెక్టర్లను ఎన్నుకునే ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీలు రూ.200, ఎస్టీలు రూ.200, బీసీలు రూ.400, ఇతరులు రూ.1000 నామినేషన్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే పోటీలో ఉన్న అభ్యర్థులు 24వ తేదీ సాయంత్రం 5 గంటలకుపైన రుసుం చెల్లించి ఓటరు జాబితా పొందవచ్చని వారు వివరించారు.

రియల్ వ్యాపారుల బరితెగింపు

- హంద్రీ-నీవా కాలువ భూమిని ప్లాట్లు వేసి అమ్మేశారు
- ఎకరాకు పైగా కాలువ భూమి ఆక్రమణ
- రూ.5 కోట్ల విలువైన భూమి



అంగళ్లు సమీపంలో హెచ్ఎన్ఎస్ కాలువ భూమి కబ్జా చేసి వేసిన ప్లాట్లు

కురబలకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ప్లాట్లు వేసి దర్జాగా అమ్మేశారు. ఈ భూమి విషయం చాలామందికి తెలియకపోవడంతో లక్షలాది రూపాయలకు విక్రయాలు చేసి కోట్లు సంపాదించారు. ఒకటిన్నర ఎకరాకు పైగా కాలువ భూమి కబ్జాకు గురైంది. దీని విలువ బయటి మార్కెట్‌లో దాదాపు రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. జిల్లాలో అంగళ్లుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం ప్రముఖ విద్యాసంస్థలకు నెలవుగా ఉంది. దీంతో సుదూర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. దీంతో ఈ ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. కాగా విద్యాసంస్థల చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధరలు ఎకరం రూ.3 కోట్ల నుంచి రూ.8 కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. ఒకప్పుడు వ్యవసాయ భూములుగా ఉండే భూములు విద్యాసంస్థలు ఏర్పడటంతో రియల్‌ఎస్టేట్ భూములుగా మారాయి. దీనివలన రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో పాటు మధ్యవర్తులు కోట్లాది రూపాయలు సంపాదించారు. ప్రజలకు ఆశ చూపించి ప్లాట్లు కొనుగోలు చేసేలా ఎలాగైనా ఒప్పిస్తారు. కొనుగోలు చేశాక ఏవైనా సమస్యలు ఎదురైతే తమకేమీ తెలియదు అన్నట్లుగా వ్యవహరించి చేతులు దులుపుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టాల్సి ఉండగా ఆ నిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ భూముల కబ్జాలో వైసీపీ నేతలదే హవా. వైసీపీ నేతల భూదాహానికి చెరువులు, వంకలు కనుమరుగయ్యాయి. మండలంలోని అంగళ్లు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్-220లో 69 ఎకరాల భూమి విస్తీర్ణం ఉంది. గతంలో హంద్రీ-నీవా కాలువ కోసం ప్రభుత్వం 6.40 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఆ భూమిని హంద్రీ-నీవా కాలువకు కేటాయించింది. అయితే ఆ భూమిలో కొంతమేరకు హంద్రీ-నీవా నిర్మాణం జరిగింది. దాదాపు ఎకరాకు పైగా ఆ భూమి మిగిలి ఉంది. దీంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూమిని ఆనుకుని ఉన్న భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి ఆ భూమిని ఆనుకుని ఉన్న కాలువకు సంబంధించిన భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు వేశారు. తమకు ఏ పాపం తెలియదన్న విధంగా వ్యవహరించి చాలామంది అమాయకులకు అమ్మేశారు. ఇది హంద్రీ-నీవాకు చెందిన భూమి అని తెలియక చాలామంది కొనుగోలు చేశారు. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. కాగా ఆక్రమణకు గురైన హంద్రీ-నీవా కాలువకు చెందిన భూమిని సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేస్తాం..

మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని హంద్రీ-నీవా కాలువకు సంబంధించిన భూములను ఆక్రమణదారులు ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విక్రయించినట్లు మా దృష్టికి వచ్చింది. గతంలో భూమికి సంబంధించిన సర్వే నెంబర్-220లో రైతుల నుంచి తీసుకుని కాలువకు మంజూరు చేశాము. ఇటీవల హెచ్ఎన్ఎస్ అధికారులు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళతాము.

- తపస్విని, తహశీల్దార్

కడపలో రామ్‌చరణ్ సందడి

- పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- రామ్‌చరణ్ చేతులమీదుగా ముషాయిరా ప్రారంభం
- ఆయనను చూసేందుకు ఎగబడ్డ అభిమానులు



ముషాయిరాలో పాల్గొన్న హీరో రామ్‌చరణ్

కడప కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీహీరో, మెగాస్టార్ చిరంజీవి తనయుడు కొణిదెల రామ్‌చరణ్ కడపలో సందడి చేశారు. సోమవారం సాయంత్రం 6-30గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్న రామ్‌చరణ్‌ను చూసేందుకు యువత పోటెత్తారు. దారి పొడవునా ద్విచక్రవాహనాలలో కేరింతలు కొడుతూ ఆయన కారువెంట వచ్చారు. రామ్‌చరణ్ మొదట బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్‌ను చూసేందుకు అభిమానులు భారీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఒకానొక దశలో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేశారు. అనంతరం ఆయన అమీన్ పీర్ దర్గా (పెద్దదర్గా)కు చేరుకున్నారు. అక్కడకూ అభిమానులు పెద్దసంఖ్యలో రావడంతో దర్గాప్రతినిధులు దర్గా గేట్లు మూసేశారు. అభిమానులను లోనికి వెళ్లనివ్వకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థులు

పెద్దదర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో రామ్‌చరణ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చాదర్ సమర్పించి దర్గా విశిష్టత గురించి తెలుసుకున్నారు. ఉరుసు మహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి దర్గాలో నిర్వహించిన ఆల్ ఇండియా 80వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా)ను రామ్‌చరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 సంవత్సరాల క్రితం తాను నటించిన మగధీర సినిమా రిలీజ్‌కు ముందు దర్గాను సందర్శించానని ఆ సినిమా సూపర్‌డూపర్ హిట్ అయిందన్నారు. ప్రఖ్యాత సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ విజ్ఞప్తి మేరకు దర్గాకు వచ్చానన్నారు. ఆయన వెంట సినీ దర్శకుడు బుజ్జిబాబు ఉన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్, నాయకులు తుంగా రమణయ్య, మాజీ నగర అధ్యక్షుడు మాలే శివ, అధ్యక్షుడు బోరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జీవీ రమణ, చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు తాజ్ షరీఫ్, టీడీపీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జిలానీబాషా, తదితరులు పాల్గొన్నారు.


కోనసీమలా...

● కొద్దిసేపు ఎండ, వెంటనే వర్షం ● రైల్వేకోడూరులో భిన్న వాతావరణం


శెట్టిగుంట ప్రాంతంలో వరి నారు సిద్ధం చేస్తున్న రైతులు


నేను సైతం అంటూ పొలం పనుల్లో బాలుడు...

రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో భిన్న వాతావరణం నెలకొంది. కొంచెంసేపు ఎండ... మళ్లీ వర్షం.. ఆపై మంచు కురుస్తూ ఊటీని తలపిస్తోంది. మరో కోనసీమగా పిలువబడుతున్న రైల్వేకోడూరు చల్లటి వాతావరణంలో విరాజిల్లుతోంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడ చూసినా పచ్చదనం ఉట్టిపడుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందో, ఎప్పుడు ఎండ వస్తుందో అంతు పట్టని వాతావరణంలో రైల్వేకోడూరు ఉంది. వాటితో పాటు మంచు కురుస్తూ చల్లటి వాతావరణం ఉంటోంది. వర్షాలకు చెరువుల్లో 60 శాతం మేరకు వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు వరి నారు పోశారు. వరి నాట్ల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రామాలమ్మకాలువ వద్ద నీరు ప్రవహించడంతో యువకులు సరదాగా ఈత కొడుతున్నారు. అడవుల్లోని వంకల్లో నీరు పారుతోంది. పచ్చదనంతో అడవులు అందాలను ఒలకబోస్తున్నాయి. చల్లటి వాతావరణంలో పక్షుల కిలకిలలతో చల్లటి గాలి పలకరింపులతో రైల్వేకోడూరులో ఊటీని తలపించే వాతావరణం ఉంది.


చల్లని వాతావరణంలో విద్యుత్ తీగలపై సేదతీరుతున్న పక్షులు


రామాలమ్మ కాలువలో ఈత కొడుతున్న యువకులు


ఊటీని తలపించే విధంగా కురుస్తున్న మంచు

వీరభద్రాలయంలో గౌరీ పూజ



ప్రత్యేక అలంకరణలో అఘోరలింగేశ్వరుడు, గౌరీదేవి పూజ చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం గౌరీదేవి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని అఘోరలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గౌరీదేవి పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ పూజలకు రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్తీక దీపారాధన చేసిన అనంతరం గౌరీదేవి పూజలను నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో ఆధ్వర్యంలో మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమం చేశారు.

బీచ్ వాలీబాల్ జిల్లా జట్టు ఎంపిక

నందలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీచ్ వాలీబాల్ అండర్-19 బాలురు, బాలికల జట్టును నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చెయ్యేరు ఒడ్డున ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఎంపికల్లో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. బాల బాలికల్లో ఇద్దరు క్రీడాకారులను మెయిన్ టీమ్‌కు ఎంపిక చేశామన్నారు. స్టాండ్‌బైలుగా రెండు టీమ్‌లకు నలుగురిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23న, 24 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌బాబు సెలెక్టర్‌గా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో పీఈటీ జగన్, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారని తెలిపారు.

కోదండరాముడిని దర్శించుకున్న ఎస్పీ


కోదండరామాలయంలో ఎస్పీ దంపతులు

ఒంటిమిట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరాముడిని అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు ఆశీర్వాదం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టత చరిత్రను తెలియజేసి శిలాసంపదను వివరించారు. కోదండరాముడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజునాయక్, అర్చకులు వీణారాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


ఎస్వీ రమణ


చలపతి


యోగానంద రెడ్డి

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 108 సర్వీసులకు చెందిన ఉద్యోగులు జిల్లా స్థాయిలో యూనియన్ ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం మొదటిసారిగా ఉద్యోగులు ఆదివారం సమావేశమై కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రామాంజులు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కలికిరికి చెందిన ఎస్వీ రమణ (పైలెట్), ప్రధాన కార్యదర్శిగా కలకడకు చెందిన సి.వెంకటాచలపతి (ఈఎంటీ), కోశాధికారిగా రాయచోటికి చెందిన యోగానంద రెడ్డి (ఈఎంటీ)లు ఎన్నికయ్యారని నూతన అధ్యక్షుడు ఎస్వీ రమణ తెలిపారు. మదనపల్లె, రాజంపేట, రాయచోటి డివిజన్లకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారని చెప్పారు. 108 సర్వీసు ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని చెప్పారు. ఈనెల 25 నుంచి 108 సర్వీసుల ఉద్యోగులు సమ్మె చేయనున్నట్లు ఇప్పటికే అధికారులకు నోటీసులందజేసిన విషయం తెలిసిందే.

సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికంగా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి. ఎప్పుడు వచ్చాయి. ఫీల్డ్‌కు వెళ్లారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్య వచ్చిన మరుసటిరోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేసి అర్జీదారులతో కలిసి ఫొటో దిగాలని, ఏదైనా నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఉంటే నోటీసు ఇచ్చి గడువు తర్వాత ఆ సమస్య తమ పరిధిలో ఉంటే తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పైస్థాయికి వెళ్లాల్సి ఉంటే ఆ విషయాన్ని అర్జీదారులకు స్పష్టంగా వివరించి తగిన ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులందరూ కూడా వారి శాఖలకు సంబంధించిన వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

జిల్లాలోని పశువులకు వంద శాతం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధిని నిర్మూలించి ఆర్థిక ప్రగతిని సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణకు టీకాలు ఒకటే మార్గమన్నారు. పశు వైద్యశాలల్లో లేదా పశుపోషకుని ఇంటి వద్దనే సంవత్సరానికి మూడు విడతలుగా ఉచితంగా టీకాలు వేయాలని సూచించారు. 4-8 నెలల వయస్సు గల పేయ దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులను సంబంధించిన పోలీసు అధికారులకు బదిలీ చేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే బాధితులు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తమ వెంట తీసుకుని రావాలని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖాధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో మదనమోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి చల్లావారిపల్లి గ్రామంలో చిరుతపులి సంచరించడంతో చిరుతపులి గుర్తుల కొరకు అన్వేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో నిత్యం చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే గ్రామంలో ఒక ఆవు, పారేసువారిపల్లిలో మేక చిరుతపులి దాడిలో మరణించాయని తెలిపారు.

రాత్రి సయమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక వేళ చిరుతపులి కనిపిస్తే వెంటనే అటవీ శాఖాధికారుకు తెలియచేయాలన్నారు. రెండు రోజుల క్రితం చలిమామిడికొండపై చిరుతపులి కనిపించిందని కొందరు గ్రామస్తులు ఆయనకు తెలిపారు. అనంతరం చిరుతపులి వెళ్లిన మార్గంలో వాటి అడుగుజాడల కొరకు వెతికారు. త్వరలోనే చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో దీప, ఏబీవో హరి, మాజీ సర్పంచ్ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పులివెందుల పశు సంవర్ధక పరిశోధనా కేంద్రం సీఈవో బదిలీ

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పులివెందులలోని ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ (ఏపీసీఏఆర్ఎల్) కేంద్రం సీఈవో డాక్టర్ వై.రమణారెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు వెటర్నరీ సైన్స్ కాలేజీ అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస ప్రసాద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. బదిలీ చేసిన రమణారెడ్డికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనే విషయం ప్రభుత్వం స్పష్టంగా చెప్పనప్పటికీ తదుపరి నియామకం కోసం ఆయనను తిరుపతి ఎస్వీయూకు కేటాయించారు.


టమోటా రైతుకు తుంపర్ల దెబ్బ

- తోటల్లోనే రాలిపోతున్న టమోటాలు
- నష్టాల బాటలో రైతన్నలు
- నాణ్యతా లోపంతో ధరలు పతనం


తుంపర్లకు దెబ్బతిన్న టమోటా తోట

గుర్రంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు సాగు చేసిన పంటలకు దెబ్బ మీద దెబ్బపడుతూనే ఉంది. దీంతో పంటలు నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నాడు. పంటలు బాగా పండిన సమయంలో ధరలు లేకపోవడం, సాగు చేసిన పంటకు ధరలున్న సమయంలో దిగుబడి రాకపోడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీనికి తోడు ప్రకృతి కూడా రైతన్నపై చిన్న చూపు చూస్తోంది. రైతన్నల కష్టాలు తీరుతాయనకున్న సమయంలో వరుణుడు దెబ్బ రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో దిగుబడి పొందకుండానే కాయలు నేల రాలిపోతున్నాయి. పంట సాగు ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేక రైతులు విలవిల్లాడుతున్నారు.

పడమటి మండలాల్లో రైతన్నలు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తారు. ఈ టమోటా పంట ఎకరా పొలంలో సాగు చేయాలంటే రైతుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. టమోటా పంట నాటింది మొదలు దిగుబడి వచ్చే వరకు ఎకరా పొలానికి రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుంది. టమోటా పంటకు ధరలున్న సమయంలో రైతులు ఆదాయం పొందుతున్నారు. ధరలు పతనమైన సమయంలో అప్పుల బాటలో పయనిస్తున్నారు. అయితే కొన్ని నెలలుగా టమోటా పంటకు ఆశాజనకంగా ధరలున్నాయి. ఈ క్రమంలో పడమటి మండలాల్లో రైతులు వేలాది ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు కిలో రూ.25 నుంచి 30 వరకు పలుకుతున్నాయి. 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.500 నుంచి 700 వరకు పలుకుతోంది. ఈ ధరలున్న రైతులు పంట సాగు ఖర్చులు పోనూ కొంత మేర అప్పుల నుంచి బయటపడతారు. ఈ క్రమంలో నాలుగు రోజుల పాటు కురిసిన తుంపర్లకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో తోటల్లోనే కాయలు రాలిపోతున్నాయి.


తోటలోనే రాలిపోయిన టమోటాలు

నాణ్యత లోపంతో ధరలు పతనం..

ఇటీవల కురిసిన తుంపర్లకు టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ఈ తుంపర్లకు టమోటా తోటల్లో ఆకులు రాలిపోయి కాయలపై నల్లమచ్చలు ఏర్పడ్డాయి. టమోటా కాయలకు మచ్చలు రావడంతో మార్కెట్‌కు తీసుకెళ్లినా కొనేవారు తక్కువ ధరకు అడుగుతున్నారు. నాణ్యత ఉన్న కాయలకు మంచి ధరలుంటే మచ్చలున్న కాయలు సగం ధర కూడా పలకడం లేదు. దీంతో పంట దిగుబడి ఉన్న రైతులు తుంపర్ల దెబ్బకు తీవ్రంగా నష్టపోయారు.

తుఫాన్‌తో నష్టపోయా...

పొలం లీజుకు తీసుకుని ఆరు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైంది. పంట సాగుకు సుమారు 15 లక్షలు ఖర్చు చేశా. ఈ క్రమంలో తుఫాన్ కారణంగా కురిసిన తుంపర్లకు టమోటా పంట పూర్తిగా దెబ్బతింది. తుంపర్లతో కాయలు దెబ్బతిని నేల రాలిపోయాయి. తోటలో ఉన్న కాయలు కూడా నాణ్యత లేకపోవడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంట సాగుకు చేసిన పెట్టుబడులు కూడా చేతికందేలా లేవు.

-ప్రభాకర్, టమోటా రైతు, గుర్రంకొండ

వైరస్‌తో కాయల్లో నాణ్యత లేదు

ఇటీవల కురిసిన అరకొర వర్షంతో టమోటా పంటలకు చీడపీడలు ఎక్కువయ్యాయి. దీంతో పంటలో కాయలు నాణ్యత లోపించకుండా ఉండడానికి వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. ఇంత చేసినా కాయలపై మచ్చలు ఏర్పడుతన్నాయి. దీంతో మచ్చలు పడిన కాయలను మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాము.

- ఎన్.శ్రీనివాసులు, రైతు, ఎల్లుట్ల, గుర్రంకొండ

చిన్నారుల 'భవిత'కు బాసట

ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోధకులకు, పిల్లలకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో వివిధ రకాల వైకల్యంతో ఉన్న చిన్నారులు పలు సేవలకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం ఫిజియోథెరపి సేవలను పునరుద్ధరించడంతోపాటు వివిధ అంశాలపై దృష్టి సారిస్తోంది. చిన్నారుల భవితకు బాటలు వేస్తోంది.

- భవిత కేంద్రాల సేవపై ప్రభుత్వం దృష్టి
- అండగా దాతల సహకారం

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 352 ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తరుపు భవిత కేంద్రం నడుస్తుండగా ప్రభుత్వేతర సంస్థ వికాస్ విహార్‌లో చిన్నారులకు విద్యాబుద్దులతోపాటు పలు రకాల సేవలు అందుతున్నాయి. భవిత కేంద్రంలో సుమారు 30 మంది పిల్లలు ఉన్నారు. వీరికి విద్యను అందించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు సంగీత (మేథోవైకల్యం), లక్ష్మిరెడ్డి (స్పీచ్ థెరపి) చెవిటి, మూగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. సాధారణ కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు అభివృద్ధి లోపం, నరాల బలహీనత బారిన పడిన పిల్లలకు ఈ కేంద్రంలో ఫిజియోతెరఫి సేవలు అందుతున్నాయి. ఫిజియోథెరపిస్టు ఉస్మాన్ అలి వారంలో ఒక రోజు కండర వ్యాయామాలు చేయిస్తున్నారు.

భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాను, పోను రవాణా, అంగరక్షక భత్యాలు వేరువేరుగా నెలకు రూ.300 చొప్పున ఇవ్వాలి. బాలికలకు ప్రత్యేక భత్యాలు, రీడర్ అలవెన్స్, హెచ్‌పీ అలవెన్స్, స్పీచ్ తెరపి, కళ్లజోళ్ల, ఎంఆర్ కిట్లు సమకూర్చాల్సి ఉంది. అంతేకాకుండా బిహేవియర్ మాడిఫికేషన్, విచిత్ర ప్రవర్తన అదుపునకు కృషి, ఐక్యూ స్క్రీనింగ్, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక వికలాంగులు అయినప్పటికి వారిలో చదవడం, రాయడం, సంఖ్యల గుర్తింపు, లెక్కింపు, డబ్బుల లెక్కింపు, నిత్యజీవితంలో అవసరమైన పనులు, స్వతహాగా చేసుకోవడం, సమాజాన్ని అర్థం చేసుకుని పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి తన పేరు, చిరునామా, ఇంగ్లీషులో సంతకాలు చేసి మేము సైతం అన్నట్లుగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని అక్కడి బోధకులు వివరిస్తున్నారు. ఈఏడాది 10వ తరగతి పరీక్షలకు తమ కేంద్రం నుంచి ఆరుగురు విద్యార్థులు క్రైబ్ సహకారంతో హాజరయ్యేలా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైకల్య సమస్య అదికంగా ఉండి భవితకేంద్రం వరకు రాలేని పిల్లలకు ఇంటికి వెళ్లి విద్యను అందించడంతోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ఆట వస్తువులతో చిన్నారులకు విద్యాబుద్ధులు

దాతల దాతృత్వం

భవిత పాఠశాల ఆవరణలో రూ.40వేల వ్యయంతో తాళ్లమాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు కే.శే శివరామయ్య ఫ్లోరింగ్ వేయించారు. టీవీఆర్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి వేడి, చల్లని నీరు అందించే వాటర్ కూలర్‌ను విరాళంగా ఇచ్చారు. వైసీపీ నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి రూ.80వేల వ్యయంతో పాఠశాలకు ఇనుప గ్రిల్స్ వేయించారు. హర్షా ఆస్పత్రి వారు పాఠశాల ఆవరణానికి రూ.15 వేలు వ్యయంతో పిట్టగోడ నిర్మాణం చేయించారు. దాతలు, స్వచ్ఛందంగా ముందుకొచ్చి దివ్యాంగులకు పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా రోజుకు ఒకరు దాతృత్వంతో అందిస్తున్నారని వివరించారు. మానవతా, ఆదరణ సేవా సంస్థల సభ్యులు భవిత పాఠశాలకు సహాయ సహకారాలు అండగా నిలిచాయని తెలిపారు. రవాణా భత్యాలు అరకొరగా అందుతుండడంతో పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లే రెండు ఆటోలకు గాను ఒక దానికి బాడుగను తల్లిదండ్రులు చెల్లిస్తున్నారని, మరో ఆటోకు ప్రతినెల బాడుగ ఆదరణ సేవా సంస్థ సభ్యులు అందిస్తున్నారని వివరించారు. పిల్లలకు చెల్లించాల్సిన భత్యాల విషయమై 'ఆంధ్రజ్యోతి' సమగ్ర శిక్షా ఐఈ కోఆర్డినేటర్ కేశవరెడ్డిని వివరణ కోరగా రవాణా భత్యాలతోపాటు పిల్లలకు అందాల్సిన వివిధ భత్యాలు సకాలంలో అందజేస్తున్నామని తెలిపారు.



స్పీచ్ థెరపి చేయిస్తున్న ఉపాధ్యాయుడు



నడక సాధన చేస్తున్న చిన్నారి

క్రీడల్లో గెలుపోటములు సహజం



చాంపియన్‌గా నిలిచిన జట్లతో క్రీడా పోటీల జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ

లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని.. ఓడిపోయినా కుంగిపోవాల్సిన అవసరం లేదని.. ఓటమి గెలుపునకు నాంది అని రాయలసీమ స్థాయి క్రీడా పోటీల జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ అన్నారు. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాలలో 14 నుంచి జరుగుతున్న రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడలు సోమవారం ముగిశాయి. అన్ని క్రీడా పోటీల్లో సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌గా వెల్లాల, వాలీబాల్ పోటీల్లో చాంపియన్‌గా వాల్మీకిపురం జట్లు నిలిచాయ. తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంఈఓ రామకృష్ణయ్య, ప్రిన్సిపల్ సత్యవతమ్మ, కోఆర్డినేటర్ నాగవేణిలు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధ గురుస్వామి ఆరాధన



విజేతగా నిలిచిన వృషభరాజముల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న సర్పంచు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కార్తీకమాసంలో జరిగే జగద్గురు సిద్ధ గురుస్వామి ఆరాధన మహోత్సవాలు విశేషంగా తరలవచ్చిన భక్తుల సమక్షంలో వైవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సిద్ధగురుస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.50వేలను సర్పంచు గంగిరెడ్డి, టీడీపీ నేత రఘునాథరెడ్డిలు అందించారు.

హుండీల లెక్కింపుతో రూ.18లక్షల ఆదాయం

చక్రాయపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించగా రూ.18,77,680 ఆదాయం వచ్చింది. అలాగే అన్న ప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.27771 వచ్చింది. మిక్స్‌డు బంగారు వస్తువులు 14 గ్రాములు, మిక్స్‌డు వెండి 460 గ్రాములు, కువైట్ దినార్ ఒకటి వచ్చింది. దాదాపు 74 రోజులకు గాను ఈ మొత్తం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి, దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ఏపీజీబ్యాంకు మేనేజర్ భానుచంద్ర, పోలీసులు హాజరైనట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష వితరణ



కలెక్టర్ శ్రీధర్‌కు చెక్కును అందజేస్తున్న బాలాజీ హైస్కూలు విద్యార్థినులు

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల బాధితుల సహాయార్థం జమ్మలమడుగు బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి సీఎం సహాయ నిధికి రూ.లక్ష వితరణగా అందించారు. సోమవారం జమ్మలమడుగులో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, డీఈవో మీనాక్షి సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విజయవాడ వరదల బాధితులకు సాయంగా పాఠశాల తరుపున విద్యార్థులు సేకరిం చిన లక్ష రూపాయలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో ప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన రామాంజులు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం చెలకలనేర్పు సమీపంలోని తులగనూరుకు చెందిన రామాంజి (38) అతని భార్య లక్ష్మీదేవి (35), కుమారుడు నిఖిల్ (10) తమ స్వగ్రామం నుంచి బాగేపల్లె సమీపంలోని పాతపాళ్యంకు బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి వెళ్లేం దుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈక్రమంలో చెన్నరాయునిపల్లె క్రాస్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చెన్నరాయునిపల్లెలోని వారి బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ రామాంజిని ప్రైవేటు అంబులెన్స్‌లో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రామాంజి భార్య కుమారుడిని చికిత్స నిమిత్తం చింతామణికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.

వరకట్నం కోసం వేధించిన వ్యక్తికి జైలుశిక్ష

పులివెందుల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరకట్నం కోసం వేధించిన వ్యక్తికి ఐదు సంవత్సరాలు కారాగార శిక్ష మరియు మూడు లక్షల తొమ్మిదివేలు జరిమానాను సోమవారం కడప ఏఎస్‌జె కోర్టు విధించింది. గూడుబాయి అల్లాబకాష్ తన ఏకైక కుమార్తె రేష్మాను పులివెందుల పట్టణం జెండామాను వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా కుమారుడు మహ్మద్‌రఫికి ఇచ్చి 19.10.2008లో కట్నం కింద 22 తులాల బంగారు, రూ.2లక్షలు నగదు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. రఫీ తాగుడుకు బానిసై ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతూ అదనపు కట్నం కోసం వేధించేవాడు. అతని వేధింపులు భరించలేక రేష్మా 01.02.2018న రాత్రి సుమారు 10.45 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులకు ఫోను చేసి తన భర్త మరియు అత్తమామలు తనను కొడుతూ వేధిస్తున్నారని, తాము చనిపోతున్నానని చెప్పి ఇంటిపైకప్పుకు ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి సోదరుడు హబీబుల్లా ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ గోపినాథరెడ్డి క్రైం నెం.49/2018 యు/ఎస్ 498(ఎ) 306, ఆర్/డబ్ల్యు 34 ఐపీసీ మరియు సెక్షన్ 3 మరియు 4 కింద కేసు నమోదు చేవఆరు. ఫిర్యాదుపై విచారించి అప్పటి పులివెందుల సీఐ కె.పుల్లయ్య ముద్దాయిని అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసును విచారించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి నేరం రుజువు కావడంతో మహ్మద్‌రఫికి ఐదేళ్ల సాధారణ జైలుశిక్ష మరియు రూ.3.9 లక్షలు జరిమానా, చెల్లించని యెడల ఒక సంవత్సరం శిక్ష విధించారు.

అదుపుతప్పి కారు బోల్తా.. ఇరువురికి తీవ్రగాయాలు





గాయపడిన వెంకటరమణ, ప్రసాద్

రైల్వేకోడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. రైల్వేకోడూరు మండలంలోని తురకపల్లె వద్ద డబుల్ రోడ్డు పనులు సాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి రైల్వేకోడూరు నుంచి చిట్వేలి మండలంలోని నేతివారిపల్లెకు ఓ కారు వెళుతుండగా ముందు వెళుతున్న మరో కారును తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మన్నెం వెంకటరమణ, ప్రసాద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఇద్దరు ఇరుక్కుపోగా.. స్థానికుల సాయంతో బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.

రూ.1.90 లక్షల నగదు చోరీ

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని సంజాముల మోటులో సోమవారం మధ్యాహ్నం రూ.1.90 లక్షలు నగదు చోరీ జరిగింది. పెద్దముడియం మండలం భీమగుండం గ్రామానికి చెందిన మోపూరి శివవెంకటసుబ్బరాయుడు మధ్యాహ్నం కెనరా బ్యాంకు నుంచి రూ.1.90 లక్షలు నగదు డ్రా చేసుకున్నాడు. పంటకు వాడే పురుగుల మందుతో పాటు డబ్బులను కట్టెల బ్యాగులో పెట్టుకుని మోటారు బైక్‌కు తగిలించుకుని సంజాముల మోటు వద్దకు వచ్చాడు. అక్కడ కూరగాయల దుకాణం వద్దకు వెళ్లి కూరగాయలు కొనేలోపు గుర్తు తెలియని వ్యక్తులు నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

రాష్ట్ర ఆదర్శ గురువులకు వైవీయూ సత్కారం



రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులను సత్కరిస్తున్న వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ప్రొఫెసర్లు వీరాంజనేయరెడ్డి, ఎం.అనిత, విజయభారతిలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ ఘనంగా సత్కరించారు. వైవీయూలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల అభినందన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ అవార్డుగ్రహీతలైన ఎల్‌వీ రెడ్డి దేశంలోని టాప్2లో ఒకరిని, డీఎస్సీ, స్విఫ్ట్, యూజీసీ పొంది పరిశోధనలో ముందుకు వెళుతున్నారని అభినందించారు. ప్రొఫెసరు అనిత తక్కువ వనరులను వినియోగించుకుని రాయలసీమ ప్రయోజనాల కోసం పరిశోధనలు చేస్తున్నారన్నారు. ప్రొఫెసరు విజయభారతి అకడమిక్ పరిశోధనల పరంగా అభివృద్ధిపథంలో ముందున్నారన్నారు.

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాలలో... : కడపనగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలుగా అవార్డు పొందిన అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ విజయలక్ష్మీదేవిని ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్‌షాజియా, డాక్టర్ శచీదేవి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ క్రిష్ణవేణిలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

కడప (క్రైం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుండి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కారక్రమం నిర్వహించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్దులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా భానుతేజ



గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్జీఎఫ్ అండర్-19 బాలబాలికల అంతర జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన డి.భానుతేజ స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా ఎంపికయ్యారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జిల్లా నిలిచింది. విజేతలకు వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.దామోదరరావు బహుమతులను అందజేశారు. జిల్లా కార్యదర్శి రవి, ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి నరేంద్ర, అంతర్జాతీయ ఖో-ఖో రీఫరీ మడకా ప్రసాద్, స్టేడియం కమిటీ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ విద్యార్థుల ప్రతిభ



మనోజ్‌ను అభినందిస్తున్న వీసీ విశ్వనాధకుమార్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైవీయూలో జరిగిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్ పోటీలలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ విద్యార్థులు ప్రతిబ కనబరిచారని వైస్‌చాన్సలర్ విశ్వనాధకుమార్, రిజిస్ట్రార్ ఎన్.రాజేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌ఏయూలో యానిమేషన్ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ మనోజ్ మొబైల్ ఫొటోగ్రాఫ్ విభాగంలో మొదటి బహుమతి లభించింది. ఈ విద్యార్థిని వైస్‌చాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ పరమశివం, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటరు సుజాత, రవికుమార్ పాల్గొన్నారు.

'పనివేళల మార్పుతో కొత్త సమస్యలు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల్లో మార్పు చేయడం ద్వారా కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున తెలిపారు. సోమవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు పనివేళలను పెంచాలని ప్రభుత్వం భావించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న పనివేళల్లో ఎటువంటి ఇబ్బందులు లేవని మార్పులు చేయడం వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. విద్యార్థులు మానసిక స్థితిపై ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, సుదర్శన్‌బాబు, గంగరాజు, రాజాబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల చాంపియన్ కడప



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలో కడప జిల్లా క్రీడాకారులు ప్రథమస్థానం, రన్నరప్‌గా తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350మందికి పైగా వచ్చారు. పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీల అనంతరం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అబ్దుల్‌సలాం మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి డిసెంబరు 2వరకు హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యలటీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

● హౌసింగ్ ఏఈ కేఎస్ఎం ప్రసాద్

రామాపురం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు పీఎంఏవై పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ కేఎస్ఎం ప్రసాద్ తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులు పీఎంఏవై పక్కా గృహాలకు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. దరఖాస్తు చేసుకునేవారు భార్యాభర్తల ఆధార్‌కార్డును, లబ్ధిదారుల అకౌంట్ నెంబరు, కులం, ఆదాయ ధ్రువపత్రాలతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెడితే మంచి ఫలితాలు సాధిస్తారని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మణి, విశ్వనాథ, వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, నిత్యపూజయ్య, సుధాకర్, శ్రీనివాసులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తులకు పెద్దఎత్తున అన్నదానం

నందలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు గ్రామంలో వెలసిన శ్రీకామాక్షి సమేత ఉల్లంఘేశ్వరస్వామి ఆలయంలో మూడో కార్తీక సోమవారం సందర్భంగా సీనియర్ రాజకీయ నాయకులు తోట కేదార్‌నాధ్ భక్తులకు అన్నదానం కార్యక్రమం భారీఎత్తున నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కేదార్‌నాథ్, కొట్టే శ్రీహరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌రాయల్, జనసేన నాయకులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



వైభవోపేతం శివపార్వతుల కల్యాణం



నిత్యపూజకోనలో స్వామివారి ఆశీస్సులు తీసుకుంటున్న సుగవాసి, రాజంపేటలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు, చిన్నమండెంలో గౌరీవ్రతం నోములు నోచుకుంటున్న దృశ్యం

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా మండల పరిధిలోని వంతాటిపల్లె గ్రామం, లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు శివభక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్ల కల్యాణం తిలకించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఆయనకు ఆలయ సంప్రదాయాలతో ఘనంగా స్వాగతం పలికారు. కల్యాణం సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. కాగా కోనలో మౌలిక వసతులపై భక్తులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య, కార్యదర్శి నాగమునిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుంకేసుల బాషా, ప్రధాన కార్యదర్శి రాయుడు, యువ నాయకులు రాజానాయుడు పాల్గొన్నారు.

రాజంపేట: కార్తీక మాసోత్సవం సందర్భంగా శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. రాజంపేట మండలంలోని అత్తిరాల, మన్నూరు, పాతబస్టాండు, గుండ్లూరు ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక కార్తీక దీపాలతో శివాలయాలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా శివుని మూలవిరాట్‌ను అందంగా అలంకరించారు. అలాగే మండలంలోని సిద్దేశ్వర గుట్టపై వెలసి ఉన్న కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని వినియోగించారు.

అంతేకాకుండా చిట్వేలి, పెనగలూరు, చిన్నమండెం, రామాపురం మండలాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెనగలూరు కోమటిరాజపురంలోని నాగలింగేశ్వర స్వామి, కామాక్షమ్మ ఆలయాలను అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి దర్శించుకొని పూజలు చేశారు.

కురబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు



భక్త కనకదాసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

రాయచోటి కలెక్టరేట్, నవంబరు18 (ఆంధ్ర జ్యోతి): భక్త కనకదాసు 537వ జయంతిని పురస్కరించుకుని రాయచోటి లోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చామకూరు శ్రీధర్ ఆధ్వర్యంలో కురబ సంఘం నాయకుల ఆధ్వర్యంలో కనకదాసు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కురబ సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు గౌనిపల్లి శివ, వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిప్రసాద్, సంఘ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

● సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు18(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ కార్మికులకు తక్షణమే కూలిరేట్లు పెంచి జీవో విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాయచోటి సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ హమాలీ కార్మికులకు కూలి రేట్లు జనవరి 2024 నుంచి పెంచాల్సి ఉండగా ఇంతవరకు జీవో విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, ఏఐటీయూసీ నాయకులు మురళి, హమాలీలు పాల్గొన్నారు.

డైరెక్టర్‌గా అనితదీప్తి ప్రమాణస్వీకారం

రైల్వేకోడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిలో ఇటీవల దుద్యాల అనితదీప్తిని కూటమి ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం విజయవాడలో కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవితో కలసి ఆ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాప్ డైరెక్టర్ జయచంద్ర, రామయ్య, నగిరిపాటి సంతోష్, దుద్యాల శశివర్ధన్, కూటమి నాయకులు సురేష్, ప్రణీత్‌కుమార్, సోహాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పశువైద్య శిబిరం

సుండుపల్లె, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ కుర్వపల్లిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సహకారంతో మెగా పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పశువులను శిబిరం వద్దకు తీసుకొచ్చి సేవలను వినియోగించుకోవాలన్నారు.

ఆలయ హుండీ చోరీ

రాజంపేటటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్‌గుట్టపై వెంకటేశ్వరాలయంలో ఆదివారం రాత్రి దుండగులు హుండీని పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. హుండీలో ఎంతమొత్తం చోరీ చేశారో తెలియరాలేదు. దీనిపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి విచారణ చేశారు.

గ్రంథాలయాలతో జ్ఞానం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల వల్ల జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ అధికారి ఉదయ కుమార్ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మనీషా హైస్కూల్‌లో వక్తృత్వ, వ్యాసరచన, పోటీలు నిర్వహించారు. ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలు

సంబేపల్లె, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం జడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం నరసింహారెడ్డి సమక్షంలో ఈ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు 20న బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి రెడ్డిశేఖర్ తెలిపారు.

సీపీఐ నాయకుడు రెడ్డయ్య మృతి

రాజంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సీపీఐ సీనియర్ నాయకులు టి.రెడ్డయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన ఉమ్మడి కడప జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేసి విద్యార్థి ఉద్యమాల్లో అనేక పోరాటాలు నిర్వహించి సమస్యల సాధనకు తనవంతు కృషి చేశారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యానికి గురై మృతిచెందారు. ఆయన మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య, సీపీఎం నాయకులు రవికుమార్, కమ్యూనిస్టు నేతలు సికిందర్, టీడీపీ నాయకులు ఎస్వీ రమణ, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మంత్రి మండిపల్లిని కలిసిన మనోహర్



రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సోమవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్సీ ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండకింద మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

'అదనపు పనులు చేయించొద్దు'

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఆశావర్కర్ల చేత అదనపు పనులు చేయించరాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు పేర్కొన్నారు. సోమవారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్‌లో ఆశావర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో తమ సమస్యల మీద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.





పేదల గూడు కోసం సచివాలయాల ముట్టడి

రైల్వేకోడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఉప్పరపల్లె, అంకమ్మనగర్, సమతానగర్, అయ్యవారిపల్లె, యానాది పల్లె, అయ్యవారిపల్లె, వెంకటేశ్వరపురం తదితర ప్రాంతాలకు చెందిన సచివాలయాలను సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆదేశాల మేరకు ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మారుబోయిన జయరామయ్య, దార్ల రాజశేఖర్‌లు మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలం ఇచ్చి వారికి ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా మందికి ఇంటి స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగిలి వినయ్, ఈశ్వరమ్మ, సుబ్బమ్మ, తేజ, శెట్టిపల్లి నరసయ్య, జ్యోతి, ప్రియ, సోనీ, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, లక్ష్మీదేవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో సుగవాసి

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1, 2, 3 టీడీపీ సభ్యత్వ నమోదులో సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదులో పాల్గొంటున్నారని, కార్యకర్తల కృషి, పట్టుదల మరువలేనిదన్నారు. వైసీపీ నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి ప్రభుత్వంపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు చెప్పినట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సామా శ్రీనివాసులు, బొడిచెర్ల శ్రీనివాసులు, చిన్నం సుబ్బరాయుడు, మునగపాటి రఘు, బీమిశెట్టి నాగరాజు, గురుమోహన్, చేపూరి ఆంజనేయులు, పుత్తా రామచంద్రయ్య, నాగమునిరెడ్డి, పార్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





సీసీ రోడ్డు తవ్వేసి గోడ కట్టారు

● ఎంపీడీవోకు గ్రామస్తుల ఫిర్యాదు

చిన్నమండెం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వండాడి గ్రామ పంచాయతీ ఉప్పరపల్లిలో ఓ వ్యక్తి సీసీ రోడ్డు తవ్వేసి గోడ కట్టాడంటూ ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్ నాయక్‌కు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. వారు తెలిసిన వివరాల ప్రకారం... గ్రామంలో తమ ముత్తాతల కాలం నుంచి వెళ్లే రహదారిని తవ్వేసి గోడ నిర్మించడంతో అటువైపు వెళ్లే దాదాపు 20 కుటుంబాలకు దారి లేకుండా పోయిందని వాపోయారు. అలాగే శ్మశానవాటికకు వెళ్లాలన్నా ఈ దారి గుండానే వెళ్లాలని తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ తాను తహసీల్దార్‌తో మాట్లాడి పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

● ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





శెట్టిగుంట ప్రాంతంలో వరి నారు సిద్ధం చేస్తున్న రైతులు


కోనసీమలా...

● కొద్దిసేపు ఎండ, వెంటనే వర్షం ● రైల్వేకోడూరులో భిన్న వాతావరణం

రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో భిన్న వాతావరణం నెలకొంది. కొంచెంసేపు ఎండ... మళ్లీ వర్షం.. ఆపై మంచు కురుస్తూ ఊటీని తలపిస్తోంది. మరో కోనసీమగా పిలువబడుతున్న రైల్వేకోడూరు చల్లటి వాతావరణంలో విరాజిల్లుతోంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడ చూసినా పచ్చదనం ఉట్టిపడుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందో, ఎప్పుడు ఎండ వస్తుందో అంతు పట్టని వాతావరణంలో రైల్వేకోడూరు ఉంది. వాటితో పాటు మంచు కురుస్తూ చల్లటి వాతావరణం ఉంటోంది. వర్షాలకు చెరువుల్లో 60 శాతం మేరకు వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు వరి నారు పోశారు. వరి నాట్ల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రామాలమ్మకాలువ వద్ద నీరు ప్రవహించడంతో యువకులు సరదాగా ఈత కొడుతున్నారు. అడవుల్లోని వంకల్లో నీరు పారుతోంది. పచ్చదనంతో అడవులు అందాలను ఒలకబోస్తున్నాయి. చల్లటి వాతావరణంలో పక్షుల కిలకిలలతో చల్లటి గాలి పలకరింపులతో రైల్వేకోడూరులో ఊటీని తలపించే వాతావరణం ఉంది.


రామాలమ్మ కాలువలో ఈత కొడుతున్న యువకులు


నేను సైతం అంటూ పొలం పనుల్లో బాలుడు...


చల్లని వాతావరణంలో విద్యుత్ తీగలపై సేదతీరుతున్న పక్షులు


ఊటీని తలపించే విధంగా కురుస్తున్న మంచు

వీరభద్రాలయంలో గౌరీ పూజ



ప్రత్యేక అలంకరణలో అఘోరలింగేశ్వరుడు, గౌరీదేవి పూజ చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం గౌరీదేవి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని అఘోరలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గౌరీదేవి పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ పూజలకు రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్తీక దీపారాధన చేసిన అనంతరం గౌరీదేవి పూజలను నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో ఆధ్వర్యంలో మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమం చేశారు.

బీచ్ వాలీబాల్ జిల్లా జట్టు ఎంపిక

నందలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీచ్ వాలీబాల్ అండర్-19 బాలురు, బాలికల జట్టును నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చెయ్యేరు ఒడ్డున ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఎంపికల్లో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. బాల బాలికల్లో ఇద్దరు క్రీడాకారులను మెయిన్ టీమ్‌కు ఎంపిక చేశామన్నారు. స్టాండ్‌బైలుగా రెండు టీమ్‌లకు నలుగురిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23న, 24 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌బాబు సెలెక్టర్‌గా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో పీఈటీ జగన్, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారని తెలిపారు.

కోదండరాముడిని దర్శించుకున్న ఎస్పీ


కోదండరామాలయంలో ఎస్పీ దంపతులు

ఒంటిమిట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరాముడిని అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు ఆశీర్వాదం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టత చరిత్రను తెలియజేసి శిలాసంపదను వివరించారు. కోదండరాముడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజునాయక్, అర్చకులు వీణారాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


ఎస్వీ రమణ


చలపతి


యోగానంద రెడ్డి

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 108 సర్వీసులకు చెందిన ఉద్యోగులు జిల్లా స్థాయిలో యూనియన్ ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం మొదటిసారిగా ఉద్యోగులు ఆదివారం సమావేశమై కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రామాంజులు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కలికిరికి చెందిన ఎస్వీ రమణ (పైలెట్), ప్రధాన కార్యదర్శిగా కలకడకు చెందిన సి.వెంకటాచలపతి (ఈఎంటీ), కోశాధికారిగా రాయచోటికి చెందిన యోగానంద రెడ్డి (ఈఎంటీ)లు ఎన్నికయ్యారని నూతన అధ్యక్షుడు ఎస్వీ రమణ తెలిపారు. మదనపల్లె, రాజంపేట, రాయచోటి డివిజన్లకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారని చెప్పారు. 108 సర్వీసు ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని చెప్పారు. ఈనెల 25 నుంచి 108 సర్వీసుల ఉద్యోగులు సమ్మె చేయనున్నట్లు ఇప్పటికే అధికారులకు నోటీసులందజేసిన విషయం తెలిసిందే.

సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికంగా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి. ఎప్పుడు వచ్చాయి. ఫీల్డ్‌కు వెళ్లారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్య వచ్చిన మరుసటిరోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేసి అర్జీదారులతో కలిసి ఫొటో దిగాలని, ఏదైనా నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఉంటే నోటీసు ఇచ్చి గడువు తర్వాత ఆ సమస్య తమ పరిధిలో ఉంటే తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పైస్థాయికి వెళ్లాల్సి ఉంటే ఆ విషయాన్ని అర్జీదారులకు స్పష్టంగా వివరించి తగిన ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులందరూ కూడా వారి శాఖలకు సంబంధించిన వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

జిల్లాలోని పశువులకు వంద శాతం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధిని నిర్మూలించి ఆర్థిక ప్రగతిని సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణకు టీకాలు ఒకటే మార్గమన్నారు. పశు వైద్యశాలల్లో లేదా పశుపోషకుని ఇంటి వద్దనే సంవత్సరానికి మూడు విడతలుగా ఉచితంగా టీకాలు వేయాలని సూచించారు. 4-8 నెలల వయస్సు గల పేయ దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టమోటా రైతుకు తుంపర్ల దెబ్బ

● తోటల్లోనే రాలిపోతున్న టమోటాలు
● నష్టాల బాటలో రైతన్నలు
● నాణ్యతా లోపంతో ధరలు పతనం

గుర్రంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు సాగు చేసిన పంటలకు దెబ్బ మీద దెబ్బపడుతూనే ఉంది. దీంతో పంటలు నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నాడు. పంటలు బాగా పండిన సమయంలో ధరలు లేకపోవడం, సాగు చేసిన పంటకు ధరలున్న సమయంలో దిగుబడి రాకపోడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీనికి తోడు ప్రకృతి కూడా రైతన్నపై చిన్న చూపు చూస్తోంది. రైతన్నల కష్టాలు తీరుతాయనకున్న సమయంలో వరుణుడు దెబ్బ రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో దిగుబడి పొందకుండానే కాయలు నేల రాలిపోతున్నాయి. పంట సాగు ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేక రైతులు విలవిల్లాడుతున్నారు.


తుంపర్లకు దెబ్బతిన్న టమోటా తోట

పడమటి మండలాల్లో రైతన్నలు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తారు. ఈ టమోటా పంట ఎకరా పొలంలో సాగు చేయాలంటే రైతుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. టమోటా పంట నాటింది మొదలు దిగుబడి వచ్చే వరకు ఎకరా పొలానికి రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుంది. టమోటా పంటకు ధరలున్న సమయంలో రైతులు ఆదాయం పొందుతున్నారు. ధరలు పతనమైన సమయంలో అప్పుల బాటలో పయనిస్తున్నారు. అయితే కొన్ని నెలలుగా టమోటా పంటకు ఆశాజనకంగా ధరలున్నాయి. ఈ క్రమంలో పడమటి మండలాల్లో రైతులు వేలాది ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు కిలో రూ.25 నుంచి 30 వరకు పలుకుతున్నాయి. 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.500 నుంచి 700 వరకు పలుకుతోంది. ఈ ధరలున్న రైతులు పంట సాగు ఖర్చులు పోనూ కొంత మేర అప్పుల నుంచి బయటపడతారు. ఈ క్రమంలో నాలుగు రోజుల పాటు కురిసిన తుంపర్లకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో తోటల్లోనే కాయలు రాలిపోతున్నాయి.

నాణ్యత లోపంతో ధరలు పతనం..

ఇటీవల కురిసిన తుంపర్లకు టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ఈ తుంపర్లకు టమోటా తోటల్లో ఆకులు రాలిపోయి కాయలపై నల్లమచ్చలు ఏర్పడ్డాయి. టమోటా కాయలకు మచ్చలు రావడంతో మార్కెట్‌కు తీసుకెళ్లినా కొనేవారు తక్కువ ధరకు అడుగుతున్నారు. నాణ్యత ఉన్న కాయలకు మంచి ధరలుంటే మచ్చలున్న కాయలు సగం ధర కూడా పలకడం లేదు. దీంతో పంట దిగుబడి ఉన్న రైతులు తుంపర్ల దెబ్బకు తీవ్రంగా నష్టపోయారు.


తోటల్లోనే రాలిపోయిన టమోటాలు

తుఫాన్‌తో నష్టపోయా...

పొలం లీజుకు తీసుకుని ఆరు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైంది. పంట సాగుకు సుమారు 15 లక్షలు ఖర్చు చేశా. ఈ క్రమంలో తుఫాన్ కారణంగా కురిసిన తుంపర్లకు టమోటా పంట పూర్తిగా దెబ్బతింది. తుంపర్లతో కాయలు దెబ్బతిని నేల రాలిపోయాయి. తోటలో ఉన్న కాయలు కూడా నాణ్యత లేకపోవడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంట సాగుకు చేసిన పెట్టుబడులు కూడా చేతికందేలా లేవు.

-ప్రభాకర్, టమోటా రైతు, గుర్రంకొండ

వైరస్‌తో కాయల్లో నాణ్యత లేదు

ఇటీవల కురిసిన అరకొర వర్షంతో టమోటా పంటలకు చీడపీడలు ఎక్కువయ్యాయి. దీంతో పంటలో కాయలు నాణ్యత లోపించకుండా ఉండడానికి వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. ఇంత చేసినా కాయలపై మచ్చలు ఏర్పడుతన్నాయి. దీంతో మచ్చలు పడిన కాయలను మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాము.

- ఎన్.శ్రీనివాసులు, రైతు, ఎల్లుట్ల, గుర్రంకొండ

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులను సంబంధించిన పోలీసు అధికారులకు బదిలీ చేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే బాధితులు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తమ వెంట తీసుకుని రావాలని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖాధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో మదనమోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి చల్లావారిపల్లి గ్రామంలో చిరుతపులి సంచరించడంతో చిరుతపులి గుర్తుల కొరకు అన్వేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో నిత్యం చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే గ్రామంలో ఒక ఆవు, పారేసువారిపల్లిలో మేక చిరుతపులి దాడిలో మరణించాయని తెలిపారు.

రాత్రి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక వేళ చిరుతపులి కనిపిస్తే వెంటనే అటవీ శాఖాధికారుకు తెలియచేయాలన్నారు. రెండు రోజుల క్రితం చలిమామిడికొండపై చిరుతపులి కనిపించిందని కొందరు గ్రామస్తులు ఆయనకు తెలిపారు. అనంతరం చిరుతపులి వెళ్లిన మార్గంలో వాటి అడుగుజాడల కొరకు వెతికారు. త్వరలోనే చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో దీప, ఏబీవో హరి, మాజీ సర్పంచ్ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పులివెందుల పశు సంవర్ధక పరిశోధనా కేంద్రం సీఈవో బదిలీ

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పులివెందులలోని ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ (ఏపీసీఏఆర్ఎల్) కేంద్రం సీఈవో డాక్టర్ వై.రమణారెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు వెటర్నరీ సైన్స్ కాలేజీ అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస ప్రసాద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. బదిలీ చేసిన రమణారెడ్డికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనే విషయం ప్రభుత్వం స్పష్టంగా చెప్పనప్పటికీ తదుపరి నియామకం కోసం ఆయనను తిరుపతి ఎస్వీయూకు కేటాయించారు.

చిన్నారుల 'భవిత'కు బాసట

● భవిత కేంద్రాల సేవపై ప్రభుత్వం దృష్టి
● అండగా దాతల సహకారం

ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోధకులకు, పిల్లలకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో వివిధ రకాల వైకల్యంతో ఉన్న చిన్నారులు పలు సేవలకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం ఫిజియోథెరపి సేవలను పునరుద్ధరించడంతోపాటు వివిధ అంశాలపై దృష్టి సారిస్తోంది. చిన్నారుల భవితకు బాటలు వేస్తోంది.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 352 ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తరుపు భవిత కేంద్రం నడుస్తుండగా ప్రభుత్వేతర సంస్థ వికాస్ విహార్‌లో చిన్నారులకు విద్యాబుద్ధులతోపాటు పలు రకాల సేవలు అందుతున్నాయి. భవిత కేంద్రంలో సుమారు 30 మంది పిల్లలు ఉన్నారు. వీరికి విద్యను అందించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు సంగీత (మేథోవైకల్యం), లక్ష్మిరెడ్డి (స్పీచ్ థెరపి) చెవిటి, మూగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. సాధారణ కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు అభివృద్ధి లోపం, నరాల బలహీనత బారిన పడిన పిల్లలకు ఈ కేంద్రంలో ఫిజియోతెరపి సేవలు అందుతున్నాయి. ఫిజియోథెరపిస్టు ఉస్మాన్ అలి వారంలో ఒక రోజు కండర వ్యాయామాలు చేయిస్తున్నారు.

భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాను, పోను రవాణా, అంగరక్షక భత్యాలు వేరువేరుగా నెలకు రూ.300 చొప్పున ఇవ్వాలి. బాలికలకు ప్రత్యేక భత్యాలు, రీడర్ అలవెన్స్, హెచ్‌పీ అలవెన్స్, స్పీచ్ తెరపి, కళ్లజోళ్లు, ఎంఆర్ కిట్లు సమకూర్చాల్సి ఉంది. అంతేకాకుండా బిహేవియర్ మాడిఫికేషన్, విచిత్ర ప్రవర్తన అదుపునకు కృషి, ఐక్యూ స్క్రీనింగ్, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక వికలాంగులు అయినప్పటికి వారిలో చదవడం, రాయడం, సంఖ్యల గుర్తింపు, లెక్కింపు, డబ్బుల లెక్కింపు, నిత్యజీవితంలో అవసరమైన పనులు, స్వతహాగా చేసుకోవడం, సమాజాన్ని అర్థం చేసుకుని పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి తన పేరు, చిరునామా, ఇంగ్లీషులో సంతకాలు చేసి మేము సైతం అన్నట్లుగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని అక్కడి బోధకులు వివరిస్తున్నారు. ఈఏడాది 10వ తరగతి పరీక్షలకు తమ కేంద్రం నుంచి ఆరుగురు విద్యార్థులు క్రైబ్ సహకారంతో హాజరయ్యేలా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైకల్య సమస్య అధికంగా ఉండి భవితకేంద్రం వరకు రాలేని పిల్లలకు ఇంటికి వెళ్లి విద్యను అందించడంతోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ఆట వస్తువులతో చిన్నారులకు విద్యాబుద్ధులు

దాతల దాతృత్వం

భవిత పాఠశాల ఆవరణలో రూ.40వేల వ్యయంతో తాళ్లమాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు కీ.శే శివరామయ్య ఫ్లోరింగ్ వేయించారు. టీవీఆర్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి వేడి, చల్లని నీరు అందించే వాటర్ కూలర్‌ను విరాళంగా ఇచ్చారు. వైసీపీ నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి రూ.80వేల వ్యయంతో పాఠశాలకు ఇనుప గ్రిల్స్ వేయించారు. హర్షా ఆస్పత్రి వారు పాఠశాల ఆవరణానికి రూ.15 వేలు వ్యయంతో పిట్టగోడ నిర్మాణం చేయించారు. దాతలు, స్వచ్ఛందంగా ముందుకొచ్చి దివ్యాంగులకు పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా రోజుకు ఒకరు దాతృత్వంతో అందిస్తున్నారని వివరించారు. మానవతా, ఆదరణ సేవా సంస్థల సభ్యులు భవిత పాఠశాలకు సహాయ సహకారాలు అండగా నిలిచాయని తెలిపారు. రవాణా భత్యాలు అరకొరగా అందుతుండడంతో పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లే రెండు ఆటోలకు గాను ఒక దానికి బాడుగను తల్లిదండ్రులు చెల్లిస్తున్నారని, మరో ఆటోకు ప్రతినెల బాడుగ ఆదరణ సేవా సంస్థ సభ్యులు అందిస్తున్నారని వివరించారు. పిల్లలకు చెల్లించాల్సిన భత్యాల విషయమై 'ఆంధ్రజ్యోతి' సమగ్ర శిక్షా ఐఈ కోఆర్డినేటర్ కేశవరెడ్డిని వివరణ కోరగా రవాణా భత్యాలతోపాటు పిల్లలకు అందాల్సిన వివిధ భత్యాలు సకాలంలో అందజేస్తున్నామని తెలిపారు.



స్పీచ్ థెరపి చేయిస్తున్న ఉపాధ్యాయుడు


నడక సాధన చేస్తున్న చిన్నారి

క్రీడల్లో గెలుపోటములు సహజం


చాంపియన్‌గా నిలిచిన జట్లతో క్రీడా పోటీల జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ

లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని.. ఓడిపోయినా కుంగిపోవాల్సిన అవసరం లేదని.. ఓటమి గెలుపునకు నాంది అని రాయలసీమ స్థాయి క్రీడా పోటీల జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ అన్నారు. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాలలో 14 నుంచి జరుగుతున్న రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడలు సోమవారం ముగిశాయి. అన్ని క్రీడా పోటీల్లో సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌గా వెల్లాల, వాలీబాల్ పోటీల్లో చాంపియన్‌గా వాల్మీకిపురం జట్లు నిలిచాయ. తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంఈఓ రామకృష్ణయ్య, ప్రిన్సిపల్ సత్యవతమ్మ, కోఆర్డినేటర్ నాగవేణిలు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ద గురుస్వామి ఆరాధన


విజేతగా నిలిచిన వృషభరాజముల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న సర్పంచు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కార్తీకమాసంలో జరిగే జగద్గురు సిద్ధ గురుస్వామి ఆరాధన మహోత్సవాలు విశేషంగా తరలవచ్చిన భక్తుల సమక్షంలో వైవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్రా కృష్ణచైతన్యరెడ్డి సిద్ధగురుస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.50వేలను సర్పంచు గంగిరెడ్డి, టీడీపీ నేత రఘునాథరెడ్డిలు అందించారు.

హుండీల లెక్కింపుతో రూ.18లక్షల ఆదాయం

చక్రాయపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించగా రూ.18,77,680 ఆదాయం వచ్చింది. అలాగే అన్న ప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.27771 వచ్చింది. మిక్సడు బంగారు వస్తువులు 14 గ్రాములు, మిక్సడు వెండి 460 గ్రాములు, కువైట్ దినార్ ఒకటి వచ్చింది. దాదాపు 74 రోజులకు గాను ఈ మొత్తం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి, దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ఏపీజీబ్యాంకు మేనేజర్ భానుచంద్ర, పోలీసులు హాజరైనట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష వితరణ



కలెక్టర్ శ్రీధర్‌కు చెక్కును అందజేస్తున్న బాలాజీ హైస్కూలు విద్యార్థినులు

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల బాధితుల సహాయార్థం జమ్మలమడుగు బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి సీఎం సహాయ నిధికి రూ.లక్ష వితరణగా అందించారు. సోమవారం జమ్మలమడుగులో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, **డీఈవో మీనాక్షి** సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విజయవాడ వరదల బాధితులకు సాయంగా పాఠశాల తరుపున విద్యార్థులు సేకరించిన లక్ష రూపాయలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో ప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన రామాంజులు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం చెలకలనేర్పు సమీపంలోని తులగనూరుకు చెందిన రామాంజి (38) అతని భార్య లక్ష్మీదేవి (35), కుమారుడు నిఖిల్ (10) తమ స్వగ్రామం నుంచి బాగేపల్లె సమీపంలోని పాతపాళ్యంకు బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈక్రమంలో చెన్నరాయునిపల్లె క్రాస్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చెన్నరాయునిపల్లెలోని వారి బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ రామాంజిని ప్రైవేటు అంబులెన్స్‌లో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రామాంజి భార్య కుమారుడిని చికిత్స నిమిత్తం చింతామణికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.

వరకట్నం కోసం వేధించిన వ్యక్తికి జైలుశిక్ష

పులివెందుల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరకట్నం కోసం వేధించిన వ్యక్తికి ఐదు సంవత్సరాలు కారాగార శిక్ష మరియు మూడు లక్షల తొమ్మిదివేలు జరిమానాను సోమవారం కడప ఏఎస్‌జె కోర్టు విధించింది. గూడుబాయి అల్లాబకాష్ తన ఏకైక కుమార్తె రేష్మాను పులివెందుల పట్టణం జెండామాను వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా కుమారుడు మహ్మద్‌రఫికి ఇచ్చి 19.10.2008లో కట్నం కింద 22 తులాల బంగారు, రూ.2లక్షలు నగదు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. రఫీ తాగుడుకు బానిసై ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతూ అదనపు కట్నం కోసం వేధించేవాడు. అతని వేధింపులు భరించలేక రేష్మా 01.02.2018న రాత్రి సుమారు 10.45 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులకు ఫోను చేసి తన భర్త మరియు అత్తమామలు తనను కొడుతూ వేధిస్తున్నారని, తాము చనిపోతున్నానని చెప్పి ఇంటిపైకప్పుకు ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి సోదరుడు హబీబుల్లా ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ గోపీనాథరెడ్డి క్రైం నెం.49/2018 యు/ఎస్ 498(ఎ) 306, ఆర్/డబ్ల్యు, 34 ఐపీసీ మరియు సెక్షన్ 3 మరియు 4 కింద కేసు నమోదు చేవఆరు. ఫిర్యాదుపై విచారించి అప్పటి పులివెందుల సీఐ కె.పుల్లయ్య ముద్దాయిని అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసును విచారించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి నేరం రుజువు కావడంతో మహ్మద్‌రఫికి ఐదేళ్ల సాధారణ జైలుశిక్ష మరియు రూ.3.9 లక్షలు జరిమానా, చెల్లించని యెడల ఒక సంవత్సరం శిక్ష విధించారు.

అదుపుతప్పి కారు బోల్తా..
ఇరువురికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకటరమణ, ప్రసాద్

రైల్వేకోడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. రైల్వేకోడూరు మండలంలోని తురకపల్లె వద్ద డబుల్ రోడ్డు పనులు సాగుతున్నాయి. ఆదివారం అర్థరాత్రి రైల్వేకోడూరు నుంచి చిట్వేలి మండలంలోని నేతివారిపల్లెకు ఓ కారు వెళుతుండగా ముందు వెళుతున్న మరో కారును తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మన్నెం వెంకటరమణ, ప్రసాద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఇద్దరు ఇరుక్కుపోగా.. స్థానికుల సాయంతో బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.

రూ.1.90 లక్షల నగదు చోరీ

జమ్మలమడుగు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని సంజాముల మోటులో సోమవారం మధ్యాహ్నం రూ.1.90 లక్షలు నగదు చోరీ జరిగింది. పెద్దముడియం మండలం భీమగుండం గ్రామానికి చెందిన మోపూరి శివవెంకటసుబ్బరాయుడు మధ్యాహ్నం కెనరా బ్యాంకు నుంచి రూ.1.90 లక్షలు నగదు డ్రా చేసుకున్నాడు. పంటకు వాడే పురుగుల మందుతో పాటు డబ్బులను కట్టెల బ్యాగులో పెట్టుకుని మోటారు బైక్‌కు తగిలించుకుని సంజాముల మోటు వద్దకు వచ్చాడు. అక్కడ కూరగాయల దుకాణం వద్దకు వెళ్లి కూరగాయలు కొనేలోపు గుర్తు తెలియని వ్యక్తులు నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

రాష్ట్ర ఆదర్శ గురువులకు వైవీయూ సత్కారం


రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులను సత్కరిస్తున్న వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ప్రొఫెసర్లు వీరాంజనేయరెడ్డి, ఎం.అనిత, విజయభారతిలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ ఘనంగా సత్కరించారు. వైవీయూలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల అభినందన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ అవార్డుగ్రహీతలైన ఎల్‌వీ రెడ్డి దేశంలోని టాప్2లో ఒకరిని, డీఎస్సీ, స్విఫ్ట్, యూజీసీ పొంది పరిశోధనలో ముందుకు వెళుతున్నారని అభినందించారు. ప్రొఫెసరు అనిత తక్కువ వనరులను వినియోగించుకుని రాయలసీమ ప్రయోజనాల కోసం పరిశోధనలు చేస్తున్నారన్నారు. ప్రొఫెసరు విజయభారతి అకడమిక్ పరిశోధనల పరంగా అభివృద్ధిపథంలో ముందున్నారన్నారు.

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాలలో... : కడపనగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలుగా అవార్డు పొందిన అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ విజయలక్ష్మీదేవిని ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్‌షాజియా, డాక్టర్ శచీదేవి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ క్రిష్ణవేణిలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

కడప (క్రైం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుండి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా భానుతేజ



గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్జీఎఫ్ అండర్-19 బాలబాలికల అంతర జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన డి.భానుతేజ స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా ఎంపికయ్యారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జిల్లా నిలిచింది. విజేతలకు వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.దామోదరరావు బహుమతులను అందజేశారు. జిల్లా కార్యదర్శి రవి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి నరేంద్ర, అంతర్జాతీయ ఖో-ఖో రీఫరీ మడకా ప్రసాద్, స్టేడియం కమిటీ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ విద్యార్థుల ప్రతిభ


మనోజ్‌ను అభినందిస్తున్న వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైవీయూలో జరిగిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్ పోటీలలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ విద్యార్థులు ప్రతిబ కనబరిచారని వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ ఎన్.రాజేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూలో యానిమేషన్ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ మనోజ్ మొబైల్ ఫొటోగ్రాఫ్ విభాగంలో మొదటి బహుమతి లభించింది. ఈ విద్యార్థిని వైస్‌చాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ పరమశివం, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటరు సుజాత, రవికుమార్ పాల్గొన్నారు.

'పనివేళల మార్పుతో కొత్త సమస్యలు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల్లో మార్పు చేయడం ద్వారా కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున తెలిపారు. సోమవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు పనివేళలను పెంచాలని ప్రభుత్వం భావించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న పనివేళల్లో ఎటువంటి ఇబ్బందులు లేవని మార్పులు చేయడం వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. విద్యార్థులు మానసిక స్థితిపై ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, సుదర్శన్‌బాబు, గంగరాజు, రాజాబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల చాంపియన్ కడప


విజేతలకు షీల్డ్ అందజేస్తున్న తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలో కడప జిల్లా క్రీడాకారులు ప్రథమస్థానం, రన్నరప్‌గా తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350మందికి పైగా వచ్చారు. పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీల అనంతరం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అబ్దుల్‌సలాం మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి డిసెంబరు 2వరకు హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యల్‌టీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్తీకం.. సకల పాపహరణం



తంబళ్లపల్లెలో గౌరీ నోములు నోచుకుంటున్న మహిళలు



మదనపల్లెలో అలంకరణలో యోగభోగేశ్వరుడు, దీపోత్సవంలో మహిళలు





పీటీఎం, కలకడలో పూజలు చేస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కార్తీకం.. సకలపాపహరణం అంటూ కార్తీక మూడో సోమవారం శివాలయాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. మదనపల్లె పట్టణంలో పలు ఆలయాల్లో సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిసెలు నైవేద్యంగా స్వామికి సమర్పించారు. చిప్పిలి గ్రామంలోని యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయం చేరుకుని కార్తీక దీపారాధన చేసి అనంతరం కేదారేశ్వర వ్రతం ఆచరించారు. అలాగే సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు కేదారేశ్వరస్వామి వ్రతం ఆచరించి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో, నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆల యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజ లు చేశారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

తంబళ్లపలెలో : కార్తీక మాస మూడో సోమవారం పురస్కరించుకుని మండలంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సోమేశ్వర స్వామి ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాన్ని ఆచరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తీక మూడో సోమవారం పురష్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు గౌరీ వ్రత నోములను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని రంగసముద్రం, విసనకర్రవాండ్లపల్లె, పీటీఎం, కందుకూరు, టి.స దుం, మల్లెల, తుమ్మరకుంట, పులికల్లు గ్రామా ల్లోని ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గౌరీవ్రత నోములను ఆచరించారు. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి.

కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవాన్నిఅంగరంగ వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న దానం నిర్వహించారు. కాగా కడప జిల్లా బ్రహ్మం గారి మఠానికి చెందిన కోలాట కళా బృందంచే కోలాట నృత్యాన్ని ప్రదర్శించారు.

కలకడలో:కలకడ సత్యవతి నది తీరన కొలువైన కామాక్షి సమేత సిద్దేశ్వర ఆలయానికి మూడో కార్తీక సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది. అలాగే కేదారేశ్వర నోములను ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా కార్తీక మాస సోమవారం కేదారేశ్వర గౌరీ నోముల వ్రత వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో ఉదయం లింగోద్భవ మహాశివునికి అభిషేకం, అర్చన, విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, మండలంలోని గండబోయనపల్లె సత్యమ్మతల్లి ఆలయాలలో కేదారేశ్వర వ్రత వేడుకలు వైభవంగా సాగాయి. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు

రైతుల సంక్షేమానికి పెద్దపీట



సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

ములకలచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో రబీ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు యూరియా, డీఏపీ కూడా సబ్సిడీతో అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో లీలాకుమారి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు రమణారెడ్డి, నారాయణ, శ్రీనివాసులు, రెడ్డెప్ప, సుబ్బినాయుడు, అంజి తదితరులు పాల్గొన్నారు.

మహిళ పోగొట్టుకున్న వస్తువులు అందజేత

మదనపల్లె అర్బన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఆటోలో మహిళ పోగొట్టుకున్న వస్తువులు సోమవారం వన్‌టౌన్ సీఐ ఎరిసావలి అందజేశారు. పోలీసుల వివరాల మేరకు పీలేరు మండలం వడేవారిపల్లెకు చెందిన వెంకటనాగులమ్మ కువైత్ వెళ్లడానికి పరీక్షల నిమిత్తం బెంగళూరు వెళ్లడానికి శనివారం మదనపల్లెకు వచ్చి ఆటో ఎక్కింది, అందులోనే తన బ్యాగ్‌ను మర్చిపోయి దిగేసింది. అనంతరం ఆమె తాను ప్రయాణించిన బ్లూకలర్ ఆటో వివరాలు తెలుపుతూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఎరిసావలి చొరవ తీసుకుని పట్టణంలో అలాంటి ఆటో వివరాలు 12 ఉన్నట్లు సేకరించడంతో సమచారం తెలుసుకున్న మదనపల్లె పట్టణంకు చెందిన ఈశ్వరాచారి వన్‌టౌన్ పోలీసులకు ఆ బ్యాగ్‌ను అందజేశారు. అందులో ఏటీఎం కార్డు, పాస్‌పోర్టు, బ్యాంక్ పాస్‌బుక్కు, బంగారు ఉంగరం ఉన్నాయి. ఆటో డ్రైవర్ మాట్లాడుతూ ఆటో ఇంట్లో ఉంచి ఊరు వెళ్లానని ఈ రోజు చూస్తే ఆటోలో బ్యాగ్ ఉండడంతో పోలీస్‌స్టేసన్‌కు వచ్చి ఇచ్చానని చెప్పారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ములకలచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులోని ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో సోమవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పాత ములకలచెరువుకు చెందిన రవితేజ(33) గాయపడ్డాడు. అలాగే రైల్వేగేటు వద్ద ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో తనకల్లు మండలం అద్దాలంపల్లె చెందిన జయచంద్రనాయుడు(46) గాయపడ్డాడు. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు.

ట్రాఫిక్ జామ్‌పై పోలీసులకు ఫిర్యాదు

పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై సోమవారం పట్టణానికి చెందిన న్యాయవాది శేషాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అజంతా టాకీసు వీధిలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పీలేరు అర్బన్ సీఐ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. శేషాద్రి ఫిర్యాదును స్వీకరించిన సీఐ మాట్లాడుతూ ఇకపై ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అజంతా టాకీసు మిట్ట ప్రాంతంలో తమ సిబ్బందిని నియమిస్తామన్నారు.

అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు



ఎక్స్‌కవేటర్ యజమానులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిప్పేస్వామి

నిమ్మనపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్స్‌కవేటర్‌లతో అక్రమంగా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ తిప్పేస్వామి హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎక్స్‌కవేటర్ యజమనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక, మట్టి తవ్వకాలు జరపాలంటే ఖచ్చితంగా అనుమతులు ఉండాలని అలాగే ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయరాదన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది ఉండి వాటికి సంబంధించిన జిరాక్స్ తమ వద్ద పెట్టుకొని పనులు చేయాలన్నారు. కొంత మంది ఇసుక, మట్టి వంటి వాటిని ఎలాంటి అనుమతులు తేకుండా తవ్వుతున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఎక్స్‌కవేటర్ యజమానులు అనుమతులు లేని వాటి పనులుకు వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



రోడ్డున్నా.. బస్సులు తిరగవన్నా..!

- బంద్రేవు - గాలివీడు మార్గంలో నడవని ఆర్టీసీ బస్సులు
- ఆందోళనలో గిరిజనగ్రామాల ప్రజలు



బంద్రేవు మార్గంలోని తాండాలకు వేసిన తారురోడ్డు

పెద్దమండ్యం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో అధికంగా గిరిజన తాండాలు నివశిస్తున్న బంద్రేవు- గాలివీడు రహదారి ఆర్టీసీ బస్సులు నడవడంలేదంటూ తాండావాసులు వాపోతున్నారు. రోడ్డు మార్గం బాగా ఉన్నప్పటికి బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సివస్తోందంటున్నారు. మండలంలోని బంద్రేవు, అవికేనాయక్ తాండ, ధేనేనాయక్‌తాండ, తుమ్మలవంకతాండ, దేవ శంతాండ, దిగువపల్లి గ్రామ ప్రజలతో పాటు గాలివీడు మండల ప్రజలు అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లాలంటే పలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా పనుల నిమిత్తం పెద్దమండ్యం, మదనపల్లి, తంబళ్లపల్లికు వెళ్లాలంటే 6 కిలో మీటర్లు నడిచి వెళ్లి బంద్రేవుకు ఆటోలలో చేరుకోవాలని ఇందుకు రూ. 100 నుంచి రూ. 150 చెల్లించాల్సి వస్తోందని వాపోయారు. బంద్రేవు నుంచి నేరుగా మదనపల్లి వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు కానీ ఆటోలు లేవని వారు తెలిపారు. గతంలో బంద్రేవు- గాలివీడు మార్గంలో ఆర్టీసీ బసు నడపాలని గత నాయకులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదన్నారు. ఈ మార్గంలో మదనపల్లి ఆర్టీసీ బసులు మదనపల్లి వయా తంబళ్లపల్లి, బంద్రేవు, గాలివీడు, పెద్దమండ్యంకు నడిపితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు, కూటమి నేతలు చర్యలు తీసుకొని బంద్రేవు-గాలివీడు గిరిజన తాండా మార్గంలో ఆర్టీసీ బసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులు నడపండి

బంద్రేవు- గాలివీడు మార్గంలో ఆర్టీసీ బసులు నడపి గిరిజన వాసులకు దశాబ్దాలుగా ఉన్న సమస్యల పరిష్కరించండి. ఈ మార్గంలో ఆర్టీసీ బసులు నడిపితే ప్రజలకు కష్టాలు తీరుతాయి. తాండావాసుల పట్ల నిర్లక్ష్యం తగదు. ఆర్టీసీ అధికారులు స్పందించండి.

- వేమయ్య, మాజీ సర్పంచ్, బంద్రేవు గ్రామ పంచాయతీ, పెద్దమండ్యం

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

వాల్మీకిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25 నుంచి 108 సిబ్బంది ప్రత్యేక సమ్మెలోకి వెళ్తుండటంపై సోమవారం తహసీల్దార్ పామిలేటికి, ఎంపీడీవో మనోహర్‌రాజు, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లకు 108 సిబ్బంది వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ 108ని ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, వేతనాలు పెంపు, ఇంక్రిమెంట్లు పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న 12గంటల పని విధానం రద్దు చేసి 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని అంతర జిల్లాల బదిలీలు, చనిపోయిన ఉద్యోగులకు రూ.20లక్షలు బీమా డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 108సిబ్బంది అమరనాథ బాబు, రెడ్డిరాజా, సంకృతి, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

సమస్యలు తీరేదాకా ఆందోళనలు

ములకలచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలు తీరేదాకా ఆందోళనలు చేపడుతామని సీపీఐ, బీకేఎంయు మండల కార్యదర్శి అంజనప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నిజాం పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సోంపల్లె, చౌడసముద్రం సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, వేమనారాయణ, రాజప్ప, మస్తానమ్మ, కనకమ్మ, కాంతమ్మ, రత్నమ్మ తదితరుతు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల ప్రచారపత్రాలను సోమవారం ఆయన పీలేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలోని విద్యను పూర్తిగా కార్పొరేటీకరణ యత్నాలను విద్యార్థి లోకం ఎదిరించాలన్నారు. ఉన్నత విద్యకు ఆటంకంగా మారిన జీవో నెం.77, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న జీవో నెం.107, 108లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, పీలేరు నాయకులు వినోద్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా మునగాల తేజ

పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ211 ఏ-2025 గవర్నర్‌గా తిరుపతికి చెందిన మునగాల తేజ యశస్వి గుప్తా నియమితులయ్యారు. పీలేరు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయనను వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యులు గవర్నర్‌గా ఎన్నుకున్నారు. మునగాల తేజతో పాత గవర్నర్ సోమిశెట్టి లీలా సురేశ్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ కార్యదర్శి, ఎన్నికల పరిశీలకులు శ్రీనివాసులు, సభ్యులు వెంకటేశ్ బాబు, ఇసా నాగలక్ష్మి, ముల్లంగి విజయ్ కుమార్, ఆర్యవైశ్యసంఘ నాయకులు, క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులను సకాలంలో ఇవ్వాలి

గుర్రంకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసరాలను సకాలంలో అందజేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు డీలర్లకు సూచించారు. సోమవారం కార్యాలయంలో రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీ నుంచే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసరాలను అందజేయాలన్నారు. ప్రతి రేషన్ దుకాణాదారుడు సకాలంలో డీడీలను చెల్లించాలన్నారు. అలాగే అక్రమార్కులకు తావులేకుండా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు సీఐగా లక్ష్మన్న

ములకలచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సీఐగా లక్ష్మన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రాజారమేష్ జిల్లా ఎస్పీకి బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మన్న మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

25లీటర్ల సారా స్వాధీనం-వ్యక్తి అరెస్టు

మదనపల్లె టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో నాటుసారా విక్రయిస్తున్న జి.కృష్ణప్ప(59) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం స్థానిక సీటీఎం రోడ్డులో , అతని వద్ద నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు జబీవుల్లా, డోర్కాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి, బోయ రాష్ట్ర డైరెక్టర్‌కు ఘన సన్మానం



మదనపల్లె అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన మండెం ప్రభాకర్‌ను సందర్భంగా సోమవారం వాల్మీకిసంఘం నాయకులు పూలమాలలు వేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈయన ప్రస్తుతం మదనపల్లె మండలం, చీకలబైలు పంచాయతీ సర్పంచ్‌గా పని చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు పాదల నరసిం హులు, మేకల విజయమోహన్, పూలకుంట్లహరిబాబు, టేకుపల్లె శ్రీనివాసులు, కొత్తకోట చావిడి కిట్టన్న పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె అర్బన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి):మదనపల్లె మండలం, తట్టివారిపల్లె, సచివాలయంలో మదనపల్లెకు చెందిన సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె పరీక్షల వైద్యశిబరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఉచితంగా ఈసీజీ పరీలతోపాటు జనరల్ వైద్యనిపుణులు, ఎముకల వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు. ఈ శిబిరానికి విచ్చేయువారు తమ ఆధార్‌కార్డును ఖచ్చితంగా తీసుకురావలన్నారు.



రెవెన్యూ సమస్యలపైనే అధిక ఫిర్యాదులు



గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలే అధికంగా వచ్చాయి. సోమవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో డివిజన్‌లోని 11 మండలాల నుంచి ప్రజలు వచ్చి వినతులు అందజేశారు. వాల్మీకిపురం మండలం ఓబులంపల్లె నుంచి నిమ్మనపల్లె రోడ్డు వరకు ఉన్న పశువులమంద భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆర్.ఎల్లారెడ్డి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం బసినికొండ గ్రామంలో తనకు మంజూరు చేసిన స్థలంలో పునాదులు వేశానని, గత వైసీపీ నాయకులు ఆ స్థలాన్ని కబ్జా చేశారని విచారించి తనకు న్యాయం చేయాలని ఇ.రామచంద్ర అర్జీ అందించారు. మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతీలో కొందరు రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారని, తమ ఇళ్లకు దారి లేకుండా చేశారని పఠాన్ ఖాదర్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్కువగా పాసుపుస్తకాలు మంజూరు చేయాలని, కొందరు రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేసి తమ పేరు మీద ఉన్న పాసుపుస్తకాలను ఇతరుల పేర బదిలీ చేశారని, అడంగల్, సర్వే సమస్యలు తదితరాల మీద మొత్తం 76 మంది సబ్‌కలెక్టర్‌కు వినతులు అందజేశారు.

మండలస్థాయిలో భూ సమస్యలపై..

మదనపల్లె అర్బన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డేలో అధికంగా భూసమస్యలపైనే ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. ఇవి క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులచే పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. రైతులకు సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. చాలా వరకు గతంలో ఇళ్లపట్టాలు ఇచ్చిన ఇంటి స్థలాల విషయంగా మరొకరు అక్రమించారని ఫిర్యాదు అందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'అపార్' గడువును పెంచాలి



జిల్లా అధ్యక్షుడు వీఆర్ రెడ్డిని సన్మానిస్తున్న పీలేరు నియోజకవర్గ కరస్పాండెంట్లు

పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అపార్ గడువును మరింత పెంచాలని ఆంధ్రప్రదేశ్ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) జిల్లా అధ్యక్షుడు వీఆర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరులోని భువనా విద్యాలయంలో సోమవారం అపుస్మా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లోని తప్పుల వల్ల అపార్ రిజిస్ట్రేషన్‌లో విపరీత జాప్యం జరుగుతోందని వాపోయారు. అదే విధంగా ప్రైవేటు విద్యాసంస్థలకు అగ్నిమాపక శాఖ అందించాల్సిన సర్టిఫికేట్ల జారీలో ఆలస్యం అవుతోందన్నారు. అనంతరం ఆయనను అపుస్మా పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా గౌరవాధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి, సభ్యులు జనార్దన్‌రెడ్డి, వీఎస్ఎన్ మాధవి, భువన ఉమాదేవి, గుణలక్ష్మి, ఐబీఎస్ భార్గవి, సుదర్శన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చిన చోటే ఇంటి నిర్మాణాలకు అనుమతివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియచేస్తున్న లబ్ధిదారులు

మదనపల్లె అర్బన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టాలిచ్చిన చోటే ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వా లని బాధితులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు నిరసన చేశారు. 1995లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో క్వీనిఫుడ్స్ కార్పొరేషన్ కార్మికులు 265 మం దికి ఆనాటి సబ్ కలెక్టర్ వలసపల్లె గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 496-1, 816-1లో 5 ఎకరాలు ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. అయితే ఆర్థిక ఇబ్బందులు కారణంగా సకాలంలో ఇంటి నిర్మా ణం చేపట్టలేకపోయామన్నారు. తిరిగి అధికారులు చదును చేసుకోమనగా లక్షల రూపాయలు ఖర్చు చేసుకుని చదును చేసినా ప్లాట్లు చేయని కారణంగా ఇళ్లు కట్టుకోలేక పోయామన్నారు. ఇటీవల ఎమ్మెల్యే షాజహాన్ బాషాను, తహసీల్దార్‌ను కలిసి విన్న వించుకోగా సర్వే నిర్వహించి అదే ప్లాట్లు చేసి ఇస్తామని హామీ ఇచ్చారని వెంటనే సర్వే నిర్వహించి ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఖాజాబీకి వినతిపత్రం అందజేశారు.

అనుమతుల్లేకుండా భూములను చదును చేయవద్దు

మదనపల్లె అర్బన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ భూములల్లో అనుమతి లేనిదే యంత్రాలతో చదును చేయరాదని వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, రూరల్ సీఐ రమేష్, తాలుకా సీఐ కళా వెంకటరమణ, టూటౌన్ సీఐ రామచంద్రలు హెచ్చరించారు. స్థానిక తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ల యాజమానుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యాజమానుల వివరాలతో నోటీసులు జారీ చేశారు. అక్రమంగా పనులు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇందులో మదనపల్లె పట్టణ, మండల పరిధిలో 72 మంది ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ యాజమానులు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణప్ప పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సీటీఎం, సీటీఎం క్రాస్‌రోడ్డు, బీకేపల్లె గ్రామ సచివాలయాల వద్ద బీకేఎంయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి రూ.4లక్షల ఆర్థిక సహాయానికి మరో లక్ష అదనంగా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు రామకృష్ణ, మల్లకార్జున, గోపాల్, నీలమ్మ, నిర్మలమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: అర్హులైన పేదలందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని సచివాలయాల వద్ద ఇంటిస్థలాల కోసం అర్జీలు సమర్పించాలన్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు సోమవారం బీరంగి గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామాలలో 3సెంట్లు, పట్టణాలలో 2సెంట్లు కేటాయించాలన్నా రు. ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చెయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్, నారాయణస్వామి. అష్రఫ్‌అలీ, శంకరప్పరవణమ్మ పాల్గొన్నారు.